ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 17 జనవరి 2025



సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



కుందూరుపల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ, ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేను పకడ్బందీ నిర్వహించాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మండలంలోని చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధి కుందూరుపల్లిలో ఆయన గురువారం సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇందులో భాగంగా పర్యవేక్షణకు అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించగా విచారణ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వివరాలను సేకరిస్తున్నాయని వివరించారు. సర్వే నిర్వహణ ద్వారా పథకాల అమలుకు లబ్ధిదాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రైతు భరోసా సాగులో ఉన్న భూముల వివరాలు నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అనువుగా లేని భూములైన నాలాలు, కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములు తదితర వివరాలకు ఎలాంటి తావు లేకుండా పకడ్బందీగా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో ఏదైనా సమస్య వస్తే సంబంధిత కారణాన్ని నోట్ చేసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, ఏఈవో కల్యాణ్, ఆర్ఐ రహ్మత్ పాషా, సర్వేయర్ నిరంజన్ తదితరులు ఉన్నారు.


అధికారులకు సహకరించాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్




సర్వే అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

మహదేవపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : కొత్తగా ప్రారంభం కానున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాలకు సంబంధించి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసే అధికారులకు ప్రజలు సహకరించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ కోరారు. మండలంలోని మహదేవపూర్, బ్రాహ్మణపల్లి, తూర్పాటిపల్లి గ్రామాల్లో సబ్ కలెక్టర్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మహదేవపూర్‌లో రైతులు, అధికారులకు సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. సర్వే నేపథ్యంలో రైతులు ఇళ్ల వద్దే ఉండి వ్యవసాయ శాఖ అధికారుల వద్ద తమ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, పలువురు అధికారులు ఉన్నారు.





ప్రైవేటు దోపిడీ!



- జిల్లాలో పెట్రేగిపోతున్న ఆస్పత్రుల యాజమాన్యాలు
- ఇష్టారాజ్యంగా హాస్పిటళ్ల నిర్వహణ
- అధిక ఫీజులతో రోగుల జేబులకు చిల్లు
- చెకప్‌లు, టెస్టుల పేరుతో వసూళ్లు
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్య శాఖ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రతి ఒక్కరికీ ఆకాంక్ష. మనిషికి ఎన్ని సిరిసంపదలు ఉన్నా ఈ సౌభాగ్యం లేకపోతే సుఖ సంతోషాలు కరవవుతాయి. అనారోగ్యమనేది మానసిక క్షోభకు గురిచేస్తుంది. అందుకే ఏ చిన్న సమస్య వచ్చినా జనం ఆస్పత్రులకు పరిగెడుతుంటారు. ఎంత ఖర్చయినా భరించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. అయితే.. జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు ఇదే అనువుగా మారింది. ఒకరి అనారోగ్యమే వాటికి వరంగా అవి భావిస్తున్నాయి. అందినకాడికి దండుకుంటూ రోగుల జేబులకు చిల్లులు వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఎలాంటి బేరసారాలు లేకుండానే చెప్పిన ధరనే 'వినియోగదారులు' చెల్లించే వ్యాపారం ఇదే కాబట్టి విచ్చలవిడిగా ఆర్థిక దోపిడీ చేస్తున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జోరుగా ఆపరేషన్లు

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పెట్రేగిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ప్రైవేటు యాజమాన్యాలు మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల పేరుతో అధిక మొత్తంలో రోగుల నుంచి ఫీజులు వస్తున్నాయని తెలుస్తోంది. మందులు, ప్రత్యేక టెస్టుల పేరుతో ఆస్పత్రుల్లో చేరినవారి జేబులకు చిల్లు పెడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. అత్యవసరమైతేనే ఆపరేషన్లు చేయాలని ప్రభుత్వం ఒకవైపు చెబుతుండగా ప్రైవేటు ఆస్పత్రులు మాత్రం ఆపరేషన్లను పెంచుకుంటూ పోతున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సిజేరియన్లు 77శాతం జరిగినట్లు వైద్యఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. దీంతోపాటు ల్యాబ్‌లు, ఇతర పరీక్షల పేరుతో ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల జేబులను గుల్ల చేస్తున్నాయని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేష్టలూడి చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులు నడిపిస్తున్నా వైద్యశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్పత్రులు 22 మాత్రమే...

జిల్లాలో పదుల సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులున్నా అధికారుల వద్ద 22 ఆస్పత్రుల వివరాలు మాత్రమే ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం భూపాలపల్లి పట్టణంలో 13 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా కాటారం మండల కేంద్రంలో తొమ్మిది ఉన్నాయి. అధికారుల లెక్కలు అటుంచితే క్షేత్రస్థాయిలో ఉన్న ఆస్పత్రులకు ఉన్న వ్యత్యాసం చాలానే ఉంది. అధికారుల వద్ద ఉన్న లెక్కలు బట్టి చూస్తే రిజిస్టర్ కాని ఆస్పత్రులు ఎక్కువే ఉన్నట్టు తెలుస్తోంది. ఇలాంటి ఆస్పత్రుల నుంచి కొందరు అధికారులకు ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

ప్యాకేజ్‌లు మాట్లాడుకొని...

జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రుల్లో అనుమతి లేకుండా ల్యాబ్‌లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలను వినియోగిస్తున్నారనే విమర్శలు లేకపో లేదు. ముఖ్యంగా కొన్ని ఆస్పత్రుల్లో ముందస్తుగా ప్యాకేజీలు మాట్లాడుకొని డెలవరీలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో

▸▸ మిగతా 8వ పేజీలో...

చెకప్‌లు, టెస్టులు అంటూ..

జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు చెకప్‌ల పేరుతో రోగులను దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ పేరుతో ఆస్పత్రులను నడుపుతూ రకరకాల చికిత్సల పేర్లతో సామాన్య జనం జేబులకు చిల్లులు వేస్తున్నాయని తెలుస్తోంది. భూపాలపల్లిలోనే అన్ని సౌకర్యాలు ఉన్న ఆస్పత్రులుండటంతో గ్రామాల్లోని ప్రజలు వైద్యసేవల కోసం ఇక్కడే వస్తుంటారు. హనుమకొండ, పరకాలకు వెళ్లే పనిలేకుండా దగ్గరలోనే ఆస్పతులు ఉండటంతో ప్రజలు భూపాలపల్లికి వస్తున్నారు. అన్ని బాగానే ఉన్నా విచ్చలవిడిగా అనేక టెస్టులతో కూడిన చికిత్సలు చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కనీస పరీక్షలకు కూడా అధికమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

- మధుసూదన్, డీఎంహెచ్‌వో



జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్న ఆస్పత్రులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఆస్పత్రుల్లో అర్హత కలిగిన వైద్యసిబ్బందిని మాత్రమే నియమించుకోవాలని ఆదేశించాం. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం.

చిన్న కాళేశ్వరం అదనపు ఆయకట్టు పరిశీలన



ప్రతాపగిరి చెరువు వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కాటారం, జనవరి 16(ఆంధ్రజ్యోతి):చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-2 పంప్‌హౌస్ వద్ద నుంచి చేపట్టిన ప్రధాన పైప్‌లైన్ మార్గంలోని చెరువులకు నీటిని తరలించి అదనపు ఆయకట్టుకు నీరందించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు, ప్రాజెక్టు పనుల నిర్మాణ సంస్థ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. గారెపల్లి రిజర్వాయర్‌కు సమీపంలోని కోమటికుంట, దేవునిచెరువు, బొప్పారం ఊర చెరువులు, పోల్కమ్మకుంట, గుర్రాలకుంట, గూడెపుచెరువుతో పాటు ఒడిపిలవంచ ఊర చెరువును అధికారులు సందర్శించి నీటిని తరలించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ప్రతాపగిరి, చిద్నెపల్లి జీపీల పరిధిలోని చెరువులన్నీ గొలుసుకట్టులా ఉండటంతో నీటి తరలింపు సులభతరమవుతుందని మాజీ ఎంపీటీసీ రవీందర్‌రావు అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ యాదగిరి, డీఈఈ ఉపేందర్, మేఘా ప్రాజెక్ట్ మేనేజర్ వైవీరావు, ఇన్‌చార్జి పాషా, మాజీ ఎంపీటీసీ రవీందర్‌రావు, ఒడిపిలవంచ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు

భూపాలపల్లి కృష్ణకాలనీ/మహదేవపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎస్సైగా సాంబమూర్తి గురువారం బాధ్యతలు స్వీక రించారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పని చేసిన సుధాకర్ టేకుమట్లకు బదిలీ కాగా, ఆయన స్థానంలో సీసీఎస్ విభాగం విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై సాంబమూర్తికి బాధ్యతలు అప్పగించారు. విధుల్లో చేరిన ఆయన తొలుత సీఐ నరేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎస్సైగా తమాషారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తమాషారెడ్డి గతంలో పలిమెల పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. బదిలీపై కాళేశ్వరానికి వచ్చారు.

భార్యను చంపి ఇంటి ఆవరణలో పాతి..



నాగమణి మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న సీఐ పెండ్యాల దేవేందర్

- తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో భర్త పరారీ
- మహబూబాబాద్‌లో వివాహిత దారుణ హత్య!

6

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

- సుమారు 2వేల క్వింటాళ్ల పత్తి దగ్ధం
- రూ.కోటికి పైగా నష్టం జరిగినట్లు అంచనా



జిన్నింగ్ మిల్లులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాటారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఓ జిన్నింగ్ మిల్లులో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. మిల్లు ఆవరణలో ఉన్న పత్తి కుప్పకు అగ్గి రాజుకొని భారీగా మంటలు చెలరేగడంతో సుమారు 2 వేల క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. దీని విలువ రూ. కోటి ఉంటుందని అంచనా. పోలీసులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండల కేంద్రం శివారు మంథని రోడ్డులోని మీనాక్షి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తికొనుగోలు కేంద్రంతోపాటు మిల్లు అధ్వర్యంలో ప్రైవేట్‌గా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన పత్తిని ఒక వైపు ఉంచగా కొంచెం దూరంలో మిల్లర్లు కొనుగోలు చేసిన మరో పత్తి కుప్ప ఉంది. మిల్లర్లు కొన్న పత్తి కుప్ప నుంచి గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు లేచాయి. దీంతో సమీపంలోనే ఉన్న మిల్లు కూలీలు, పత్తి విక్రయాల కోసం వచ్చిన వాహనదారులు, రైతులు కేకలు వేశారు. వెంటనే మిల్లు నిర్వాహకులు కిషన్, కిషోర్ అక్కడికి చేరుకుని మిల్లులో అందుబాటులో ఉన్న అగ్నిప్రమాద నిరోధక చర్యలను చేపట్టారు. మోటార్ ఆన్ చేసినా సాంకేతిక కారణాలతో కొన్ని నిమిషాలపాటు నీళ్ల పంపింగ్ కాకపోవడంతో పత్తి కుప్పలో మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారమిచ్చి మరోసారి మిల్లులో నీటిని పంపింగ్ చేసే పైప్‌లైన్ ద్వారా మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. మంటలు అదుపులోకి వచ్చే క్రమంలోనే ఫైరింజన్ సైతం చేరుకుంది. ఫైర్ ఆఫీసర్ అడువాల శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పేశారు. పత్తి దగ్ధం విషయం తెలిసి కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఈ ప్రమాదంలో సుమారు 2 వేల క్వింటాళ్ల పత్తి కుప్ప దగ్ధమైనట్టు మిల్లు నిర్వాహకులు కిషన్ తెలిపారు. దీంతో రూ. కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. పత్తి కుప్ప దగ్ధం కావడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పలు అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. పత్తిని డంపింగ్ చేయడానికొచ్చిన ఏదైనా వాహనం సైలన్సర్ నుంచి నిప్పు రవ్వలు వెలువడి పత్తిపై పడి ప్రమాదం చోటుచేసుకుందా? ఎవరైనా కూలీలు లేదా ఆ ప్రాంతంలో సంచరించినవారు బీడీ, సిగరెట్టు ముట్టిస్తే ఇది సంభవించిందా? అనేది అనుమానాస్పదంగా ఉంది. లేదా బీమా కోసం ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా? అనే చర్చ కూడా సాగుతోంది. అగ్నిప్రమాదం సంఘటనపై మిల్లు నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పీఆర్ అధికారులతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పీఆర్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవర్గంలో పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్ అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులన వెంటనే ప్రారంభించి వాటిని త్వరగా పూర్తిచేయాలని అన్నారు. పనులను చేపట్టడంలో జరిగిన ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగిపోయిన పనులు నెలరోజుల్లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. ఈ పనులను కూడా త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్ ఈఈ, డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి




రాయమల్లు. (ఫైల్)

చిట్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భూతగాదా నేపథ్యంలో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన ఓర్సు రాయమల్లు (65) కైలాపూర్ శివారు శాంతినగర్‌లో ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. శాంతినగర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు తుమ్మల శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన సంపంగి కొమురయ్యతో కలిసి రాయమల్లు ఇంటికి చెందిన కొంత భూమిని ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. ఈనెల 13న కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశాడు. ఈక్రమంలో తాను 20 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నానని, తనకున్న భూమిని ఆక్రమించుకోవద్దని వారిని రాయమల్లు వేడుకున్నాడు.

ఈ క్రమంలో ఆ వ్యక్తులు దూషణలకు పాల్పడడంతో మనస్తాపం చెందిన అతడు ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో రాయమల్లు మృతి చెందాడు. మృతుడికి భార్య కొమురయ్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు తుమ్మల శ్రీనివాస్, సంపంగి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'రైతు భరోసా' సర్వే ప్రారంభం



భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతు భరోసా పథకం అమలు కోసం సర్వే ప్రారంభమైంది జిల్లాలోని 214 రెవెన్యూ గ్రామాల్లో సాగుయోగ్యం గల భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో 44 టీంలను కలెక్టర్ రాహుల్‌శర్మ ఏర్పాటు చేశారు. గురువారం జిల్లాలోని 44 రెవెన్యూ గ్రామాల్లో సర్వే టీంలు రైతు భరోసా పథకం అమలు సర్వే నిర్వహించారు. 22 గ్రామాల్లో 250 ఎకరాల పైచిలుకు సాగు యోగ్యం కాని భూములను సర్వే బృందాలు గుర్తించినట్లు సమాచారం. సర్వే అనంతరం గ్రామసభల్లో సాగుయోగ్యం కాని భూములను గ్రామసభల ముందుంచనున్నారు.

రేపు భూపాలపల్లిలో మందకృష్ణ పర్యటన

భూపాలపల్లిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ శనివారం భూపాలపల్లికి రానున్నట్లు ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమానికి లక్షలాదిగా తరలిరావాలనే పిలుపు మేరకు భూపాలపల్లికి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్ల ప్రారంభం

గణపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశంతోపాటు 7నుంచి 10 తరగతిలో మిగిలిన సీట్లను భర్తీకి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఏప్రిల్ 13న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కూచిపూడి నృత్యంలో బంగారు పతకం



కోలిండియా పోటీల్లో కూచిపూడి నృత్యం చేస్తున్న శ్రీనివాస్

కాకతీయఖని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో జరిగిన కోలిండియా స్థాయి సాంస్కృతిక పోటీల్లో సింగరేణి భూపాలపల్లి ఏరియాకు చెందిన అడిచర్ల శ్రీనివాస్ కూచిపూడి నృత్యంలో ప్రతిభను చాటాడు. ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ మేరకు ఏరియా అధికార ప్రతినిధి కూపూరి మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జానపద గ్రూప్ డ్యాన్స్‌లో ఏరియా కళాకారులు శ్రీనివాస్, కేశవులు, సురేష్, రవి, రాజ్‌కుమార్, నరేష్, విజయ్‌కుమార్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారని వివరించారు. వీరికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, ఎస్‌వో టు జీఎం కవీంద్ర అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు.

హేమాచల క్షేత్రానికి చేరిన ఉద్యమకారుడి సైకిల్ యాత్ర



హేమాచల క్షేత్రం వద్ద ఉద్యమకారుడు శ్రీనివాస్ పటేల్

మంగపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ అయ్యప్ప మాలధారణలో సైకిల్ యాత్ర చేపట్టిన కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం చింతకుంట వాసి కుడిది శ్రీనివాస్ పటేల్ ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రానికి గురువారం చేరుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుడైన శ్రీనివాస్ ఈనెల 4న తన సైకిల్ యాత్రను ప్రారంభించారు. హేమాచల క్షేత్రంలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కాంక్షిస్తూ పుణ్యక్షేత్రాలను సైకిల్ యాత్ర ద్వారా దర్శించుకుంటున్నానని ఆయన తెలిపారు. 41 రోజులు 41 దేవాలయాలను సందర్శించుకోవాలని సంకల్పించానని అన్నారు. ఇప్పటి వరకు 23 దేవాలయాలను దర్శించుకున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు.

మినీ జాతర ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర



మేడారంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

మేడారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. మేడారంలో ఆయన గురువారం పర్యటించారు. భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, దర్శనాల సౌకర్యాలు, జంపన్నవాగు పుణ్య స్నానాల ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, కల్యాణ కట్టలు, మరుగుదొడ్లు, రోడ్లు తిరుగుతూ పరిశీలించారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు సమ్మక్క-సారలమ్మల మినీ జాతర జరుగనున్న నేపథ్యంలో తరలివస్తున్న భక్తులకు త్వరితగతిన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మినీ జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేసిందన్నారు. ముఖ్యంగా భక్తులకు పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ, వీవీఐపీ, ప్రొటోకాల్ దర్శన సౌకర్యాలు మెరుగ్గా ఉండాలన్నారు. దర్శనాల సమయంలో భక్తులకు తోపులాటలు జరగకుండా రద్దీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. అంతేకాకుండా వైద్య సేవలను మెరుగ్గా అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవరాజ్, ఎంపీడీవో సుమనావాణి, పంచాయతీ కార్యదర్శి సతీష్, రెవెన్యూ, దేవాదాయ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

భార్యను చంపి ఇంటి ఆవరణలో పాతి..

- తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో భర్త పరారీ
- మహబూబాబాద్‌లో వివాహిత దారుణ హత్య!



మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సిగ్నల్ కాలనీలో ఘటనా స్థలం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



ఘటనా స్థలం వద్ద గుమికూడిన స్థానికులు

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను చంపి మృతదేహాన్ని తమ ఇంటి ఆవరణలోనే పాతిపెట్టి, దానిపై పేడతో కల్లాపు చల్లి.. తల్లిదండ్రులు, సోదరి కుటుంబంతో కలిసి భర్త పరారైన దారుణ ఘటన మహబూబాబాద్‌లో గురువారం వెలుగు చూసింది. మహబూబాబాద్ సిగ్నల్ కాలనీలో జరిగిన ఈ ఘటనలో తాటి నాగమణి(35) అనే వివాహిత శవమై కనిపించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. చిత్తు కాగితాలు ఏరుకుంటూ, వేమ వాటర్ విక్రయిస్తూ జీవనం సాగించే తాటి గోపీ.. తన భార్య నాగమణి(35), తల్లిదండ్రులు లక్ష్మీ, రాములు, సోదరి దంపతులు రావూరి దుర్గ, మహేందర్‌తో కలిసి సిగ్నల్ కాలనీలో ఓ ఇంట్లో రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. దుర్గ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ గోపీ కుటుంబం 13వ తేదీ నుంచి అర్థాంతరంగా కనిపించకుండా పోయింది. ఇంటికి తాళం వేసి ఉండడం, ఆవరణలో గుంత తవ్వి ఏదో పూడ్చినట్టు ఉండి దుర్వాసన వస్తుండడాన్ని స్థానికులు గమనించారు. అయితే, మా అత్తను చంపి బొందా పెట్టారని.. దుర్గ చిన్న కుమార్తె మానస జనవరి 6న కాలనీలో పలువురి దగ్గర మాట్లాడగా, ఇదేమని దుర్గను ప్రశ్నించగా ఆ మాట దాటవేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో హత్య జరిగిందనే అనుమానంతో ఉన్న కాలనీవాసులు బుధవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఒడిసాలో ఉన్న ఇంటి యజమానిని రప్పించిన పోలీసులు.. ఇంటి ఆవరణలో అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతంలో గురువారం ఉదయం తవ్వించగా నాగమణి మృతదేహం బయటపడింది. అనంతరం ఇంటి తాళం పగలుగొట్టి లోపల చూడగా.. రావూరి దుర్గ ఆధార్ కార్డు మాత్రమే లభ్యమైంది. దుర్గ చిరునామా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం అని ఆ కార్డులో ఉంది. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, పరారీలో ఉన్న గోపీ, అతని కుటుంబం దొరికితేనే నాగమణి హత్యకు కారణం తెలియనుంది.

మేడారం నుంచి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తొర్రూరు మండలానికి చెందిన భక్తులకు గాయాలు

ములుగు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మేడారం అమ్మవార్ల దర్శనం చేసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 12మంది భక్తులకు స్వల్ప గాయాలైన సంఘటన గురువారం రాత్రి వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్ క్రాస్ వద్ద జరిగింది. వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన 15మంది ఓ ట్రాలీ వాహనంలో గురువారం మేడారం అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకున్న అనంతరం వారు స్వగ్రామానికి తిరుగుప్రయాణం కాగా.. వారి వాహనం వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్ క్రాస్ వద్దకు చేరుకున్న క్రమంలో వెనుకనుంచి వచ్చిన మరో ట్రాలీ వాహనం ఢీకొట్టింది. దీంతో ట్రాలీలో ప్రయాణిస్తున్న వారిలో పెరుమాండ్ల విజయ, వెంకన్న, శ్రీనివాస్, పులి ప్రవీణ్, మురళి, శ్రీలేఖ, శ్రీ, వినయ, ఉప్పలయ్య, బి.లావణ్య, రజిత, పి.స్రవంతి గాయాలయ్యాయి. వారిని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం స్వగ్రామానికి పంపారు. ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

వెంకటాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పేడుగొల్లగూడెం గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో దుర్గాప్రసాద్ ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి డ్రైవింగ్ సీటు నుంచి కిందపడ్డాడు. దీంతో ఆయన ఎడమకాలు పైనుంచి వెనుకచక్రం వెళ్లడంతో కాలు పూర్తిగా దెబ్బతింది. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరు నాగారం తరలించారు.

ఆదివాసీ న్యాయ కళాశాల కోసం ఉద్యమించాలి

వెంకటాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు కోసం ఆదివాసీలు ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం సాయి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలతోపాటు తెలంగాణ ఆదివాసీ యువతకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ యువతకు ఆదివాసీ చట్టాలపై అవగాహన అవసరమని అన్నారు. ఏజెన్సీలో ఆది వాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కారం ఆనంద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం మూడుకొట్ల సెంటర్‌లో గురువారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మూడుకొట్ల సెంటర్‌కు చెందిన పాము వెంకటనారాయణ(70) దుస్తుల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో పాటు చిన్నకుమారుడు కిరణ్‌కుమార్ మానసిక వికలాంగుడు కావడంతో మనోవేదనకు గురైన ఆయన గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటివారు చిన్నకుమారుడు మీనాన్న ఇంకా లేవలేదా? అని ప్రశ్నించగా అతను ఏమి చెప్పలేకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికిలో నుంచి చూశారు. అప్పటికేఫ్యానుకు ఉరివేసుకుని వెంకటనారయణ మృతి చెంది కన్పించడంతో పెద్దకుమారుడు శ్రావణ్‌కుమార్ సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్‌కుమార్ ఇంటికి చేరుకున్నారు. శ్రావణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాంకు వద్ద రైతుల నిరసన

కాటారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పంట రుణాల కోసం వచ్చిన తమపై బ్యాంకు అధికారి దురుసుగా ప్రవర్తించాడని రైతులు నిరసన తెలిపారు. భూపా లపల్లి జిల్లా కాటారంలో ఎస్‌బీఐ వద్ద గురువారం ఆందోళనకు దిగారు. గట్ల కుంటకు చెందిన రాజునాయక్ తమ కుటుంబ సభ్యులు, బంధువులతో పంట రుణాల కోసం ఫైళ్లను తీసుకుని బ్యాంకుకు వెళ్లగా ఫీల్డ్ ఆఫీసర్ దురుసుగా ప్రవర్తించాడని ఆరోపించారు. తనను ఆయన 'నువ్వెవరు.. ఎందుకు వచ్చావ్.. బయటకు వెళ్లు' అని మండిపడ్డాడని రాజునాయక్ తెలిపారు. గతంలో తమపై కూడా ఈ ఫీల్డ్ ఆఫీసర్ ఇదే విధంగా ప్రవర్తించాడని, కేసు పెడతానంటూ బెదిరించాడని తెలంగాణ జేఏసీ చైర్మన్ బొమ్మ సమ్మిరెడ్డితోపాటు పలువురు ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు ఇలా దురుసుగా ప్రవర్తించడం సరికాదని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమల సందీప్ అన్నారు. దీనిపై ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ రుణాల కోసం వచ్చే వారితో మరికొందరు రానవసరం లేదని చెప్పానే తప్ప దురుసుగా మాట్లాడలేదని స్పష్టం చేశారు.

రోగికి వైద్యం అందకపోవడంపై డీఎంహెచ్‌వో విచారణ



పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డీఎంహెచ్‌వో మురళీధర్

దంతాలపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ రోగికి నర్సింగ్ ఆఫీసర్ వైద్యం చేయకపోవడం పట్ల గురువారం జిల్లా వైద్యాధికారి మురళీధర్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ బుధవారం పీహెచ్‌సీలో చోటుచేసుకున్న ఘటనపై విచారణకు ఆదేశించారు. మురళీధర్ ప్రత్యేక బృందంతో కలిసి వైద్య సిబ్బంది పనితీరుపై విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. వైద్య సిబ్బందిలతో సమావేశమై జరిగిన ఘటనపై ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికివచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అసోసియేషన్ వార్షిక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లా 12వ స్థానంలో ఉందని, రాబోయే పరీక్షల ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా దృషి సారించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. విద్యారంగం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందన్నారు. ఉద్యోగనియామకాలు చేపడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, సమ్మెట వెంకటేశ్వర్లు, మందుల శ్రీరాములు, వాంకుడోతు బాలాజి, వెంకటేశ్వరరావు, రవికుమార్, యాదగిరి, రాందాస్, ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఫారుక్, వహిద్, పూజారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం అడ్డుపడిన ద్రోహులను తరిమికొట్టిన ఘనత ఉద్యమకారులదేనని, గత కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించారని, సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు మల్లయ్య, నర్సింహారెడ్డి, వెంకన్న, సుధాకర్, నాగరాజు, హుస్సేన్, బుచ్చిరాములు, దేవేందర్, సంపత్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మునిసిపల్ పాలకవర్గ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ రాంచంద్రయ్య

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాలకవర్గ సమావేశం గురువారం చైర్మన్ రాంచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. మునిసిపాలిటీలో గత సమావేశంలో జరిగిన అంశాలు, ఐదేళ్లుగా మునిసిపాలిటీ పరిధిలో చేపట్టిన పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో తొర్రూరు మునిసిపాలిటీని ఆశించినంత మేర అభివృద్ధి చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరీ, అభివృద్ధి పనులు కొనసాగాయని, మునిసిపాలిటీలో మోడల్ మార్కెట్, చిల్డ్రన్స్ పార్కు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, మెయిన్ రోడ్డులో డ్రైనేజీ లాంటి పనులు పూర్తి చేశామన్నారు. మరో 30 శాతం పనులు పూర్తి చేస్తే తమ హయాంలో అన్ని పనులు అభివృద్ధి చేసినట్లు అవుతుందని, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సాకారంతో రూ.10కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. పాలకవర్గం ముందు పెట్టిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు శ్రీనివాస రావు, రాము, రోజా, సునీత జైసింగ్, దొంగరి రేవతిశంకర్, గజానంద్, అలివేలు, నాగజ్యోతి, శంకర్, మాధవిఅనిల్, కో-ఆప్షన్‌లు, కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ కట్ట స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

తొర్రూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలుకు అనుకూలంగా ప్రకటన చేయాలని మాదిగ కళాకారుల రాష్ట్ర కో-ఆర్డినేటర్ యాసారపు సాయిలు, ఉద్యోగుల రాష్ట్ర నాయకుడు సోమారపు ఐలయ్య అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ ఏ బీ సీ డీ వర్గీకరణ అమలు పర్చాలనే లక్ష్యంతో మాదిగల అస్థిత్వ పోరాటం చేపడుతున్నామని, సామాజిక న్యాయ పోరాటం కోసం జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమంలో మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నేడు తొర్రూరు డివిజన్ కేంద్రంలో మాదిగ ఉప కులాల ఆధ్వర్యంలో డప్పు కళాకారులచే అంబేద్కర్ విగ్రహం నుంచి జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందని, ఈ ర్యాలీకి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మహంకాళి బుచ్చయ్య, మంగళపల్లి రాంచంద్రయ్య, బాబు, అంజయ్య, శ్రీనివాస్, మంగళపల్లి శ్రీను, సురేందర్, భిక్షపతి, రంజిత్, యాకయ్య, రమేష్, పూర్ణచందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సొంతూళ్ల నుంచి తిరుగుముఖం

- సంక్రాంతి పండుగకు వచ్చి వెళ్తున్న జనం
- ఖాళీ అవుతున్న పల్లెలు, పట్టణాల్లో పెరుగుతున్న రద్దీ



మానుకోట బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

మహబూబాబాద్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు వచ్చిన జనం తిరుగుముఖం పట్టారు. రైతులకు పంట చేతికందడంతో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం పల్లెల్లో సంక్రాంతిని ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు పల్లెలకు చేరుకోవడంతో పండుగ శోభను సంతరించుకున్నాయి. పండుగ రోజుల్లో మహిళలకు ముగ్గులు, యువతకు గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించడంతో పల్లెలన్నీ సందడిగా మారి ఎక్కడ చూసినా జనసందోహం కన్పించింది. సంక్రాంతి పండుగ ముగియడంతో గురువారం సొంతూళ్ల నుంచి బయలు దేరి తిరిగి వారివారి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. పండుగను పురస్కరించుకుని ఈనెల 11 నుంచి 17 వరకు విద్యాసంస్థలకు రాష్ట్ర సర్కార్ సెలవులు ప్రకటించగా, ఉద్యోగులకు ప్రతీ ఏటా సంక్రాంతి పండుగకు వచ్చే మూడు రోజులతో పాటు జనవరి 11న రెండవ శనివారం, 12న ఆదివారం కావడంతో ఏకంగా పండుగ సెలవులు ఐదు రోజులు వచ్చాయి. ఈక్రమంలో పండుగకు ముందస్తుగానే తమ పిల్లాపాపలతో ఈ నెల 11న పట్టణాల నుంచి సొంతూళ్లకు చేరుకున్నారు. ఐదు రోజుల పాటు పల్లెల్లో పండుగ సంబురాలు జరుపుకుని 15న సాయంత్రం నుంచే తిరుగు ప్రయాణమయ్యారు. 16న పెద్ద మొత్తంలో గ్రామాల నుంచి పట్టణాలకు బయలుదేరడంతో ఆర్టీసీ బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిటకిట లాడాయి. పండుగకు వచ్చిన బంధువులు తరలిపోవడంతో పల్లెలన్నీ ఖాళీగా బోసిపోయి కన్పించాయి. ఐదు రోజుల పాటు రద్దీ తక్కువగా ఉన్న పట్టణాలకు జనం చేరుకోవడంతో గురువారం నుంచి మళ్లీ వాహనాల తాకిడి పెరిగిపోయింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6250	5600
పల్లికాయ (పచ్చిది)	4950	4100
కందులు	7033	5560
పెసళ్లు	-	-
పత్తి	7210	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14800	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	13000	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	15000	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



ఐనవోలు ఆలయం ప్రాంగణంలో ప్రోక్షణ చేస్తున్న అర్చకులు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావులు

మల్లన్న స్వామికి ఘనంగా సంప్రోక్షణ

పట్టువస్త్రాలు సమర్పించిన కూనూరు వాసులు

ఐనవోలు, జనవరి16 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులతో పూజలందుకున్న స్వామి వారికి గురువారం వైభవంగా మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించారు. పుణ్యాహవాచనములో భాగంగా వేదపండితులు, అర్చకులు స్వచ్ఛమైన జలము సుగంధ ద్రవ్యాలు నవధాన్యాలు కలుషంలో మిలితం చేసి మంత్ర పఠనం చేస్తూ స్వామి వారిని అవాహన చేశారు. తదుపరి ఆలయంతోపాటు ప్రాంగణములో వేద మంత్రోత్సరణలతో ప్రోక్షణ (చల్లడం) జరిపారు. మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకములు చేసి శివలింగాన్ని స్వామి వారి ప్రతిబింబముతో అలంకరించి అన్నపూజ నిర్వహించి మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు బ్రాహ్మణులకు పండిత సన్మానాలూ సమారాధన జరిపారు. సంప్రోక్షణ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, అర్చకులు భానుప్రసాద్, ఉప్పల శ్రీనివాస్, అర్చక సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

కునూరు వాసుల పట్టువస్త్రాలు

జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కునూరు గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామికి పట్టువస్త్రాలు బహూకరించారు. జాతరలో లక్షలాది మంది భక్తులచే పూజలు అందుకున్న స్వామి వారికి మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించాక స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేయడం అనవాయితీగా కొనసాగుతోంది. ఈ పట్టు వస్త్రాలను కునూరు ఉమామహేశ్వరం(శివాలయం) దేవాలయం, గ్రామ పంచాయతీలు ఆరేళ్లుగా అందజేస్తున్నాయి. మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడమ్మ, భ్రమరాంబదేవిక గణపతి అంజనేయస్వామిలకు పట్టువస్త్రాలను సమర్పించాక స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకుడు సదాశివశర్మ, బ్రహ్మణపల్లి మధుశర్మ గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామికి కోడె మొక్కులు చెల్లిస్తున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్

కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

భీమదేవరపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి సన్నిధికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఆలయ ఈవో కిషన్‌రావుల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి గుమ్మడికాయ, కోడె మొక్కులను చెల్లించారు.

యువ

ఆసక్తే ఆవిష్కరణలకు ప్రేరణ

పదికిపైగా పరికరాలను రూపొందించిన యువశాస్త్రవేత్త సంతోష్ కుమార్

వాటిలో సైన్యానికి ఉపయోగపడేవే ఎక్కువ



తాను రూపొందించిన వాయిస్ టెలిస్కోప్‌తో యువ శాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్

హనుమకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సరికొత్త సాంకేతిక పరికరాలను రూపొందించాలంటే ఆసక్తి, పరిశోధనలపై అనురక్తి.. శాస్త్ర, సాంకేతిక ఫలాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న తపన ఉండాలి. ఇందుకు నిషిత దృష్టి, లోతైన అధ్యయనమూ ఎంతో అవసరం. ఇవన్నీ పుష్కలంగా ఉన్న యువశాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్.. అతి తక్కువ కాలంలోనే పదికిపైగా సరికొత్త పరికరాలకు రూపకల్పన చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటకు చెందిన సంతోష్‌కుమార్ ప్రస్తుతం నర్సంపేటలోని బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన ఆయన వరంగల్ పాలిటెక్నిక్ కంప్యూటర్ సైన్స్‌లో డిప్లమా చేసిన తర్వాత విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బీటెక్, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఎంటెక్, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బాల్యం నుంచి కొత్త వస్తువులు తయారు చేయడమంటే ఎంతో ఆసక్తి ఉన్న ఆయన పాఠశాల స్థాయిలో చాలా సైన్స్ ఎగ్జిబిట్లు చేసి ప్రదర్శనకు పెట్టి.. ఎన్నో ప్రైజ్‌లు కూడా దక్కించుకున్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై మరింత దృష్టి పెట్టారు.

అటానమస్ రోబో

సైనికులకు ఎంతో ఉపయోగంగా ఉండే ఒక రోబోకు కూడా రూపకల్పన చేశారు సంతోష్‌కుమార్. ఈ రోబో సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, శత్రువుల సమాచారం నమోదు చేయడం, వారిని కట్టడి చేయడం, గాయపడిన సైనికులను గుర్తించి యుద్ధం నుంచి సురక్షిత ప్రాంతానికి చేరవేయడానికి ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాన్ని నడపడం లాంటి పనులు ఈ రోబో చేస్తుందని ఆయన వివరించారు. మొదటి దశ ప్రయోగం పూర్తయిందని, ప్రస్తుతం 50శాతం పనులు ఈ రోబో చేయగలుగుతోందని, దీనిని తయారు చేయడానికి ఇప్పటి వరకు రూ.50లక్షలు ఖర్చయిందని తెలిపారు.

సోలార్ పీసీ..

తాను రూపొందించిన పరికరాల్లో సోలార్ కంప్యూటర్‌కు కేవలం మానిటర్ ఉంటుందని, 12 వోల్టుల సోలార్ ప్యానెల్ జతచేయడం ద్వారా అడవిలో కూడా పనిచేస్తుందన్నారు. దీని తయారీ వ్యయం రూ.15వేలని, పేద విద్యార్థుల కోసం అన్ని ప్రోగ్రామింగ్ లాంగ్వేజులు, ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌లు అన్ని ఇందులో పొందుపరిచానని, 38 ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఇందులో రన్ అవుతాయని, బ్లూటూత్, వైఫై ఇన్‌బిల్ట్‌గా ఉంటాయని, మానిటర్, మౌజ్, కీబోర్డు మాత్రమే బయట ఉంటాయన్నారు. ఒక సారి రీచార్జ్ చేస్తే కరెంట్ లేకుండా కూడా చాలా సేపు వాడుకోవచ్చని, ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ ధర రూ. 25వేల నుంచి రూ 30వేలు ఉందని, ఒక కంప్యూటర్ కొనాలంటే రూ.50వేలకు పైనే అవుతుందని, పేద విద్యార్థుల కోసం తక్కువ ఖర్చుతో దీనిని తయారు చేశానన్నారు.

విదేశాల్లో పరిశోధనలు.. దక్కిన అవార్డులు..

తక్కువ ఖర్చుతో తయారు చేసిన పీసీకి మంచి స్పందన వచ్చిందని, దీనిపైనే విదేశాల్లో పరిశోధనలు చేయడానికి అవకాశం లభించిందని, ఆఫ్రికాలో ఈ ప్రాజెక్టును అమలు చేయమని పిలుపు వచ్చిందని సంతోష్ కుమార్ వివరించారు. జర్మనీ, ఆఫ్రికా దేశాల్లో ఈ ప్రాజెక్టుపై పనిచేశానని, అక్కడ ఇళ్లపై అనుమానాస్పద స్థితిలో ఎగిరే డ్రోన్లను గుర్తించే ఆటోమెటిక్ డిఫెన్స్ డిటెక్టివ్ సిస్టమ్ రూపొందించానన్నారు. ఇతియోపియా యూనివర్సిటీలో రెండేళ్లపాటు వివిధ పరిశోధనలు చేశానన్నారు. అయితే డాక్టర్ సంతోష్ పరిశోధనలకు గాను 2018లో మైసూర్ యూనివర్సిటీ యంగ్ సైంటిస్టు అవార్డును ప్రదానం చేసింది. మానవ రహిత ఛోదక వాహనం తయారీకి న్యూఢిల్లీ బీడీఎస్‌ఏ అంబేద్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డు అందించింది. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా నర్సంపేట పట్టణంలోనే ఉంటున్న డాక్టర్ సంతోష్ కుమార్ తండ్రి శీలం సత్యనారాయణ తండ్రి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. తల్లి సరస్వతి. డాక్టర్ సంతోష్‌కు భార్య శివరాణి, ఇద్దరు కుమారులున్నారు. ఒక పక్క కాలేజీలో విద్యాబోధన సాగిస్తూనే మరో పక్క పరిశోధనలను మరింతగా కొనసాగిస్తానంటున్నారు. తన ఆలోచనల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు ఉన్నాయనీ, వాటికి భవిష్యత్తులో ఒక రూపాన్ని ఇస్తానని డాక్టర్ సంతోష్ అంటున్నారు.

డ్రైవర్ రహిత వాహనం



సంతోష్ రూపొందించిన మానవ రహిత వాహనం

సంతోష్ ఆవిష్కరణల్లో ముఖ్యమైంది డ్రైవర్ రహిత వాహనం. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే వాహనాన్నే ప్రయోగానికి వినియోగించి.. కృత్రిమ మేధతో ఒక సిస్టమ్‌ను ఈ వాహనంలో ఉపయోగించి డ్రైవర్ లేకుండానే నిర్దేశిత మార్గంలో సునాయాసంగా ప్రయాణించేలా రూపకల్పన చేశారు. మనిషి ప్రమేయం లేకుండా అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగే ఈ వాహనం సైనికులకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని, సైనికులు సరిహద్దుల్లో కాపాలాలో భాగంగా ఒక చోటి నుంచి మరో చోటికి వేళ్లేప్పుడు బరువైన సామగ్రి, ఆయుధాలను మోసుకెళుతుంటారు. ఆ సమస్యను అధిగమించడానికి ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుంది. 2489 సీసీ ఇంజన్ గల ఈ వాహనం గేర్, క్లచ్, బ్రేక్‌లను తనకుతానే నియంత్రించుకుంటూ ఎప్పటికప్పుడు దిశను మార్చుకుంటూ ముందున్న వాహనాన్ని అనుసరించేలా డీప్‌లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వాడుకొని ఈ వాహనాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఈ వాహనం రూపకల్పన చివరి దశలో ఉండగా.. దీనిపై ఇప్పటి వరకు రూ.18లక్షల వరకు ఖర్చవగా.. అదంతా బాలాజీ ఇన్ స్టిట్యూట్ యాజమాన్యమే భరించింది. అలాగే ఈ మానవ రహిత వాహనంపై గుంటూరులోని నాగా ర్జున విశ్వవిద్యాలయం, మధ్యప్రదేశ్‌లోని మంగల్యా తన్ యూనివర్సిటీలో పరిశోధన జరుగుతోందని, వాటిని తానే కోఆర్డినేట్ చేస్తున్నానని సంతోష్ తెలిపారు. ఈ వాహనం తయారీపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని, దీనిని మరింత ఆధునికీకరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వాయిస్ టెలిస్కోప్..

దూరంగా ఉండే వస్తువులను చూసేది సాధారణ టెలిస్కోప్. దీనికి భిన్నమైనదే వాయిస్ టెలిస్కోప్. అరకిలో మీటరు దూరంలో ఉన్న వ్యక్తులను చూడడమే కాదు.. వారు ఏం మాట్లాడుకుంటున్నది కూడా వినవచ్చు. ఇది కూడా సైనికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, 2017-18లో రూపొందించిన ఈ పరికరాన్ని వరంగల్ నిట్ ప్రొఫెసర్లు కూడా చూసి ప్రశంసించారని, ఒక అంతర్జాతీయ సదస్సులో ఈ పరికరంపై ప్రజంటేషన్ ఇచ్చినప్పుడు మంచి స్పందన వచ్చిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించిన ఈ పరికరానికి పేటెంట్ లభించిందని, ఈ వాయిస్ టెలిస్కోప్‌ను మరింత ఆధునికీకరించేందుకు కృషి జరుగుతోందని, ఈ పరికరం తయారీకి రూ.4లక్షలు ఖర్చయిందని, ఈ పరికరాన్ని బల్క్‌గా ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ కింద రూ.3.50లక్షల నిధులను ఇచ్చిందన్నారు.

దృశ్యాదృశ్యీకరణ ప్రయోగం

దృశ్యాదృశ్యీకరణ.. మన వేదాల్లో యంత్రసర్వస్వం గ్రంథం ఉందని, భరద్వాజ మహర్షి సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం ఇంగ్లీష్‌లో అనువాదమైందని, దానిని చదివినప్పుడు దృశ్యాదృశ్యీకరణ తనను బాగా ఆకర్షించిందన్నారు. కొన్ని చెట్ల ఆకుల రసాన్ని తీసి దానికి కొన్ని రకాల రసాయనాలను జోడించి ఒక ఇమేజ్‌పై పోసినప్పుడు అది తెల్లగా మారి అదృశ్యమైపోతుందని, దీనిని చూడాలంటే ప్రత్యేక పరికరం కావాలని, ఆ పరికరాన్ని తాను తయారు చేశానని, దీన్నే వేదాల్లో దృశ్యాదృశ్యీకరణ (ఇన్‌విజుబులిటీ) ప్రక్రియగా పేర్కొంటారన్నారు. కొన్ని అంతర్జాతీయ సదస్సుల్లో ఈ ప్రయోగంపై డెమో ఇచ్చినప్పుడు ప్రశంసలు వచ్చాయని దీనిపై ఇంకా లోతుగా పరిశోధన చేయాల్సి ఉందన్నారు.

ప్రస్తుతం గూడ్స్ రైళ్లకు వినియోగిస్తున్న డబ్ల్యూఏజీ-09 ఎలక్ట్రిక్ లోకో మోటివ్



- సరుకు తరలింపులో కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 లోకో మోటివ్‌లు
- కొత్త ఇంజన్ల రాకతో పెరగనున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం
- మేక్ ఇన్ ఇండియాలో భాగంగా బిహార్‌లో తయారీ చేపట్టిన రైల్వేశాఖ

గూడ్స్ రవాణాలో గేమ్‌చేంజర్!

డోర్నకల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మన భారతీయ రైల్వేశాఖ సరుకు రవాణాకు వినియోగిస్తున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపు కాగా, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగం 50 నుంచి 52 కిలోమీటర్లు లోపు మాత్రమే ఉంది. ఈ విషయాన్ని గతేడాది రైల్వే శాఖమంత్రి లోక్‌సభలో వెల్లడించారు. ఇకపై పరిస్థితి మారనుంది. సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందిన దేశాల్లోలా.. సరుకును మరింత వేగంగా గమ్యానికి చేర్చేలా అధునాతన డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌ల ను రైల్వేశాఖ రూపొందిస్తోంది. 12వేల హార్స్‌పవర్... గంటకు 120కిలోమీటర్ల వేగం.. 6వేల టన్నుల బరువును ఎత్తుమార్గంలో సైతం లాగేలా తయారు చేస్తున్న ఈ కొత్త ఇంజిన్లు గూడ్స్ రవాణా వ్యవస్థలో గేమ్‌చేంజర్‌గా నిలవనున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మన దేశంలో 1980వ దశకం వరకు రైళ్ల ద్వారానే అత్యధికంగా సరుకు రవాణా జరిగేది. సరళీకరణ, ఆర్థిక విధానాల ప్రవేశపెట్టిన తరువాత పెద్దఎత్తున జాతీయ రహదారుల నిర్మాణ విస్తరణ చేపట్టారు. దీంతో రోడ్డు రవాణా రంగం పుంజుకుంది. ప్రస్తుతం మన రైల్వేశాఖ సరుకుల రవాణాకు డబ్ల్యూఏజీ-9 లోకోమోటివ్‌లను వినియోగిస్తుండగా.. ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లోకి వేళ్లే సమయంలో ఇంజన్‌లు లోడును లాగలేక మొరాయిస్తున్న సంఘటనలున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్‌పెట్టేలా డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లను తయారు చేస్తోంది. ఇప్పటికే పారిశ్రామీకరణ రోజురోజుకు విస్తరించిన నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు, వాటితో తయారైన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలను, ఉత్పత్తులను పెద్దస్థాయిలో వేగంగా తక్కువ ఖర్చుతో తరలించడానికి గాను గూడ్స్‌రైళ్లను ఉపయోగిస్తున్నారు. దీంతో రైల్వేలో గూడ్స్ రైళ్ల రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. అందుకు అనుగుణంగా రైల్వేలైన్ల నిర్మాణం మాత్రం ఆశించిన మేర పెరగలేదు. 70 శాతం బ్రిటిష్ హయంలో నిర్మించిన మార్గాల మీదుగానే రైళ్లు రాకపోకలు జరుగుతున్నాయి. భారతీయ రైల్వేలో ప్రస్తుతం 68 వేల కిలోమీటర్ల పొడవు గల ట్రాక్ ఉండగా.. ఇందులో స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ హయాంలో సుమారు 54 వేల కిలోమీటర్ల మేర రైల్వేలైను నిర్మించగా.. స్వాతంత్ర్యం అనంతరం కేవలం 14వేల కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని మాత్రమే నిర్మించారు. ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైళ్ల రాకపోకలతో రైల్వేట్రాక్‌లపై విపరీతమైన రద్దీ ఉంటుంది. ఉదాహరణకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగానే సగటున ప్రతీ 12 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది.

గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే..

రైల్వేశాఖలో గూడ్స్‌రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణం రైళ్ల రద్దీనే కాకుండా ప్రస్తుతం ఉన్న రైల్వేట్రాక్‌లపై ఏదో ఒకరోజు నిర్వహణ పనులు కొనసాగుతుండడం, చాలాచోట్ల వందేళ్ల క్రితం అప్పటి ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు, వంపు మార్గాలు అధికంగా ఉండడం, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు, నిర్వహణ సిబ్బంది కొరత, రైలు ఇంజన్ల సామర్థ్యం తదితర కారణాలనిని చెప్పవచ్చు. ప్రస్తుతం విపరీతమైన ఆలస్యంతో నడుస్తున్నా.. రైళ్లవల్ల సరుకు, ప్రయాణికుల చేరవేతలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని రైల్వే చేరుకోలేకపోతోంది. భారతీయ రైల్వేలో మౌళిక వసతుల కల్పన మరియు నూతన రైల్వేనిర్మాణం కోసం గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయిస్తున్నారు. అందులో భాగంగానే ఉత్తర, దక్షిణ భారతదేశాలను అనుసంధానిస్తున్న న్యూఢిల్లీ-చెన్నై (గ్రాండ్‌ట్రంక్) మార్గంలో మూడోరైల్వే ట్రాక్ నిర్మా ణాన్ని చేపట్టింది. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ట్రాక్ అందు బాటులోకి వస్తే సత్వరమే వేగంగా రైళ్లను.. ముఖ్యంగా గూడ్స్‌రైళ్ల వేగం పెంచేందుకూ కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే శక్తివంతమైన రైలు ఇంజన్‌లను దేశంలోనే తయారు చేస్తున్నారు.

ఇప్పటికే బొగ్గు తరలింపులో వినియోగం..

శక్తివంతమైన ఈ కొత్త లోకోమోటివ్‌లను రాష్ట్రంలో వినియోగిస్తున్నారు. ఇవి గతేడాది నవంబరులో పట్టాలెక్కాయి. డోర్నకల్-భద్రాచలంరోడ్, మణుగూరు, ఇల్లెందు మధ్య సింగరేణి బొగ్గును తరలించేందుకు డోర్నకల్ రైల్వేజంక్షన్ మీదుగా నడిచే గూడ్స్ రైళ్లకు ఈ అధునాతన బాహుబలి ఇంజన్లను రైల్వేశాఖ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం వీటి పనితీరు మెరుగ్గా ఉండటంతో భవిష్యత్‌లో వీటిని మరిన్ని రైళ్లకు వినియోగించేలా చర్యలు చేపడుతోంది.

కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 ఇంజన్..

రైల్వేలో డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లు.. రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఇంజన్‌లను బిహార్ రాష్ట్రంలోని మాదేపూరలో రైల్వేశాఖ వీటి తయారీని చేపట్టింది. అందులో భాగంగా డబ్ల్యూఏజీ-12 మరియు డబ్ల్యూఏజీ-12బి సిరీస్ ఇంజన్లను తయారు చేస్తోంది. 12 వేల హార్స్ పవర్ (అశ్వికశక్తి) గల ఈ లోకోమోటివ్‌లు 6 వేల టన్నుల అధిక లోడును ఎత్తుమార్గంలో సైతం లాగడమే కాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే విధంగా రూపకల్పన చేశారు. రైలు డ్రైవర్ (లోకోపైలెట్), సహాయ డ్రైవర్ (అసిస్టెంట్ లోకోపైలెట్)లకు సౌకర్యవంతంగా ఉండే విధంగా క్యాబిన్‌ను పూర్తిగా ఎయిర్ కండీషన్ చేశారు. ఇలాంటి శక్తివంతమైన ఎలక్ట్రిక్ రైళ్ల లోకో మోటివ్‌లను తయారు చేసిన ప్రపంచంలోని ఆరో దేశంగా మనదేశం నిలిచింది. అందులో భాగంగా దేశంలోని వివిధ రైల్వేజోన్‌లలో ఎత్తు పల్లాలు అధికంగా ఉన్నమార్గాల్లో ఈ బాహుబలి ఇంజన్లతో కూడిన గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. త్వరలో ఈ ఎలక్ట్రికల్ ఇంజన్లను భారీ ఎత్తున చేపట్టడానికి గాను మాదేపూర ప్లాంట్ విస్తరణను రైల్వే శాఖ చేపట్టింది.




రైల్వేలో నూతనంగా ప్రవేశపెట్టిన డబ్ల్యూఏజీ-12బీ లోకో మోటివ్

ప్రారంభమైన అన్నారం దర్గా ఉర్సు

అలరించిన ఖవ్వాళి గేయాలు

ఘనంగా సందల్ (గంధం) ఊరేగింపు



విద్యుద్దీపాల వెలుగులో దర్గా ఆవరణ

పర్వతగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్ గ్రామంలోని యాకూబ్‌షావళి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముజావరు గౌస్‌పాషా ఇంటివద్ద హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులచే ఖవ్వాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు ఆలపించిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం అక్కడినుంచి సంధల్(గంధం) తీసుకుని బయలుదేరి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో జెండాలు, గంధంతో ముజావర్లు, మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్లు ఒళ్లు గగుర్పొడిచే రీతిలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం తెల్లవారుజామున దర్గాకు గంధం తీసుకువచ్చిన ముజావర్లు యాకూబ్‌బాబాకు సమర్పించారు. అనంతరం చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



దర్గా వద్ద ఉర్సు సందడి

వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు

పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో బోర్డు ఇన్స్‌క్టర్ రియాజ్‌పాషా ఏర్పాట్లు చేపట్టారు. వక్ఫ్‌బోర్డు నుంచి ఉర్సు ఉత్సవాలకు రూ.8.50 లక్షలు మంజూరు కాగా, ఆ నిధులతో పారిశుధ్యం, తాగునీరు, భక్తుల విడిది, దర్గాతో పాటు చిల్లాలకు రంగులు, విద్యుద్దీపాలు, దర్గా ఆవరణలో అలంకరణ దీపాలు, రెండో రోజు భక్తులకు అన్నదానం తదితర ఏర్పాట్లు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, దర్గా పరిసరాలు, ప్రధాన రోడ్లపై పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో విడిది చేశారు.

నేడు అన్నదానం

ఉర్సు ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నదానం చేపట్టనున్నారు. గురువారం రాత్రి దర్గాకు గంధం చెల్లించడంతో శుక్రవారం రోజంతా భక్తులు దర్శనం చేసుకుంటారు. చివరి రోజైన శనివారం దీపారాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
శుక్రవారం 17 జనవరి 2025

రోడ్ల విస్తరణ పనులకు

అనుమతులు ఇవ్వాలి

• ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణ పనులకు అవసరమయ్యే అటవీ భూములకు అనుమతులు మంజూరు చేయాలని భూపా లపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఫారెస్టు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం సమావేశమయ్యారు.భూపాలపల్లి నియోజ కవర్గం పరిధిలోని అటవీ గ్రామాల్లో రోడ్ల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణానికి అటవీ భూముల కేటాయింపుపై సమీక్షించారు. రహదారుల విస్తరణ ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగు తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి రహదారులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. పర్యావరణాన్ని రక్షించే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రహదారుల విస్తరణ పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్ ఈఈ మనోహర్ పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి

కలెక్టర్ టీఎస్ దివాకర



గోవిందరావుపేట మండలం నేతాజీగూడెంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వతేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం మండ లంలోని పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని నేతాజీ గూడెంలో జరుగుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల విచారణ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాటాడుతూ నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, ఈసర్వేలో భాగంగా పర్యవేక్షణకు అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని అన్నారు. విచారణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వివరాలను సేకరిస్తున్నాయని అన్నారు. సర్వే నిర్వహణ ద్వారా పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని, సర్వే నిర్వహణకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాల లబ్ధి ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన స్పష్టం చేశారు. రైతుభరోసాకు సాగులో ఉన్న భూముల వివరాల నమోదుకు వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. వ్యవసాయానికి అనువుగా లేని నాలాలు, కన్వర్షన్ అయిన భూ ములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములు, తదితర వివరాలను ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ఏమైనా సమస్య వస్తే కారణాలను రాయాలని సూచిం చారు. ఈనెల 20వతేదీ వరకు సర్వే జరుగు తుందని, 21నుంచి 24వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే, గ్రామసభలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎంపీడీవో జవహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, సిబ్బంది అంజుం పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వే పరిశీలన

మేడారం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల సర్వేను జిల్లా కలెక్టర్ దివాకర గురువారం పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం, అంకంపల్లి గ్రామాల్లో చేపడుతున్న సర్వేను సందర్శించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి కుటుంబాన్ని క్షుణ్ణంగా సర్వే చేస్తూ అర్హులను గుర్తించాలన్నారు.

'ప్రైవేటు' దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

భూపాలపల్లి పట్టణంలోని ఓ ఆస్పత్రిలో నర్సు ఆకస్మిక మరణం కలకలం రేపింది. ఆస్పత్రి యాజమాన్యంపై ఆరోప ణలు వెల్లువెత్తిన వైద్యశాఖ అధికారులు కన్నెత్తి చూసిన దాఖాలలు లేవు. చాలా ఆస్పత్రుల్లో అర్హతలేని వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన వైద్యశాఖ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రుల్లో నిర్వహించే మెడికల్‌షాపుల్లో బిల్లులు కూడా ఇవ్వడంలేదనే విమర్శలు సైతం ఉన్నాయి. సాధారణ ప్రసవాలనే ప్రోత్సహించాలని, సిజేరియన్లు తగ్గించాలని ప్రభుత్వం చెబుతున్నా జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు పట్టనట్టే ఉంటున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి గత నెల వరకు ప్రైవేటు ఆస్పత్రుల్లో 919 డెలవరీలు జరిగితే, అందులో 710 డెలవరీలు పూర్తి సెక్షన్‌లుగా నమోదు అయ్యాయి. మొత్తం డెలవరీల్లో 77శాతం సెక్షన్‌లే ప్రైవేటులో జరుగుతున్నాయి.

తనిఖీలు మరిచిన వైద్య ఆరోగ్య శాఖ

భూపాలపల్లి జిల్లా ఆవిర్భవం నుంచి ఇప్పటి వరకు ప్రైవేటు ఆస్పత్రులపై దాడులు నిర్వహించింది అంతంత మాత్రమే అని తెలుస్తోంది. తూతూమంత్రంగా తనిఖీలు చేస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ అలసత్వం ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు అవకాశంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నత విలువలతో జీవించాలి

న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి



పూర్వ విద్యార్థులతో న్యూసైన్స్ కళాశాల అధ్యాపకులు

భూపాలపల్లిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు ఉన్నత విలువలతో జీవించాలని న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్.మూర్తి అన్నారు. కళాశాల ఆవరణలో 2012-2015 పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, డైరెక్టర్లు శివనారాయణ, గోవర్ధన్ అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కలయిక అందరికీ మానసికోల్లాసాన్ని ఇస్తుందని అన్నారు. మానవతా విలువలు పెంపొందేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్నేహ, అజిత, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన చిట్యాల సీఐ

మొగుళ్లపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను చిట్యాల సీఐ మల్లేష్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన సిబ్బంది పనితీరును పరిశీలించడంతోపాటు పెండింగ్ కేసులపై ఆరా తీశారు. 100 డయల్ విషయంలో బ్లూకోల్ట్ సిబ్బంది ఆలస్యం చేయొద్దని అన్నారు. పలు రికార్డులు, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహ నాలను తనిఖీ చేశారు. ఆయన వెంట స్థానిక ఎస్సై బి.అశోక్, సిబ్బంది ఉన్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



మహాముత్తారంలో భూమి పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మహాముత్తారం, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లగూడెం, మహాముత్తారం గ్రామాల్లో జరుగుతున్న సంక్షేమ పథకాల సర్వేను భూపాలపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్లగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. మహాముత్తారంలో రైతు భరోసా పథకంలో భాగంగా మండల కేంద్రంలో ప్లాట్లు చేసిన భూములను ఆయన పరిశీలించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ డి. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చిన్న కాళేశ్వరం నుంచి చెరువులకు నీరు

మహదేవపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం నుంచి చెరువులకు నీళ్లు నింపాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు జారీ చేయడంతో ఈఈ యాదగిరితో పాటు సిబ్బంది ఆ ప్రదేశాన్ని గురువారం పరిశీలించారు. ఎన్ని చెరువులు ఉన్నాయనే అంశంపై సర్వేలు నిర్వహిస్తున్నామని, అవి నింపితే మత్స్యకారులు లాభాలు పొందుతారని తెలిపారు. రైతులకు కూడా సాగు నీరు అందేందుకు ఈ చెరువులను నింపాలని ఆదేశాలు రావడంతో చెరువుల సర్వేను అధికారులు ప్రారంభించారు.

సర్వేలో పాల్గొన్న జడ్పీ సీఈవో

రేగొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి) :నాలుగు పథకాల అమలులో భాగంగా మండలంలోని బాగిర్తిపేట, కనిపర్తి, దమ్మన్నపేట గ్రామాల్లో జడ్పీప సీఈవో విజయలక్ష్మి గురువారం పర్యటించారు. రైతుబరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై ఫీల్డ్ సర్వే చేశారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామని ఆ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్



కాటారం జీపీ పరిధిలో సర్వేను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

కాటారం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే నుంచి అమలు చేయబోయే నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి చేపడుతున్న క్షేత్రస్థాయి సర్వే, లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అన్నారు. మండలంలోని కాటారం, రేగులగూడెం, మేడిపల్లి, మద్దులపల్లి, శంకరంపల్లి, ధర్మసాగర్ జీపీల పరిధిలో మండల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది గురువారం సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహించే క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించారు. కాటారం జీపీ పరిధిలోని సబ్‌స్టేషన్‌పల్లిలో జరుగుతున్న క్షేత్రస్థాయి సర్వేను సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తనిఖీ చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిర మ్మ ఇళ్ల కోసం చేస్తున్న సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సర్వే సమగ్రంగా పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డుల సర్వేలో తమ పేర్లు రాలేదని కొందరు అధికారుల దృష్టికి తీసుకురాగా అర్హులైన వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మంజూరు అవుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ పీడీ మంజుల, ఎంపీడీవో అడ్డూరి బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి, డీటీ రామ్మోహన్, ఏవో పూర్ణిమ, ఏపీవో వెంకన్న, ఆర్ఐ వెంకటయ్య, టీఏలు మనోజ్, శ్రీనివాస్, రవళి, రవి, కార్యదర్శులు సమీర్‌ఖాన్, కృష్ణవేణి, శ్రీనివాస్, రాజశేఖర్, కుమారస్వామి, రాకేష్, ఏఈవోలు ఆస్మా, సరిత, రాజన్న, దీపక్, దివ్యజ్యోతి, రెవెన్యూ సిబ్బంది రమాదేవి, శేఖర్, శ్రీనివాస్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాజేడు వైద్య శాలలో

క్షయ నిర్ధారణ పరీక్షలు

వాజేడు, జనవరి 16: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తల ద్వారా జ్వరం, దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వాజేడు పీహెచ్‌సీకి తీసుకొచ్చి పరీ క్షించారు. వారి నుంచి నమూనాలను సేకరించి వెంకటాపురం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా వాజేడు వైద్యాధికారి డాక్టరు కొమురం మహేందర్ మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, శీతాకాలంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్ఎస్ కోటిరెడ్డి, ఎల్‌టీ రజినికాంత్, రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

రేగొండ, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం పెట్రోలింగ్ చేస్తుండగా ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. పరకాల-భూపాలపల్లి రహదారికి దగ్గరలో నిల్వ చేసి ఉన్న ఇసుక డంప్‌ను రెవెన్యూ సిబ్బందికి అప్పగించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక నిల్వ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాళేశ్వరంలో రక్తదాన శిబిరం

మహదేవపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీహెచ్‌సీ కాళేశ్వరం గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లేతకారి రాజబాపు, నగునూరి రాజు, గగ్గురు దుర్గారాజ్, తూనూరి సంతోష్, సకినారపు సందీప్, రేహన్‌ఖాన్, రెవెల్లి రాకేష్, గోరె నగేష్, కీర్తి శరత్ , నార్ల గణేష్ తదితరులు, మహబూబ్, అరిగెల సుమన్ సహా 21 మంది రక్తదానం చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సుష్మిత తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో డాక్టర్ అక్షయ్, డాక్టర్ హరిణి, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీకాంత్, సంధ్య, శ్రీను, నర్సింగ్ ఆఫీసర్ సౌజన్య, కీర్తి, పీహెచ్ఎన్ నీరజ పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో

పోలీసుల తనిఖీలు



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు గురువారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. జాగిలాలతో బస్టాండ్, క్రాస్ రోడ్డు, వై-జంక్షన్, ఆకులవారిఘణపురంతో ప్రాంతాల్లో సోదాలు చేశారు. అలాగే వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్సై తాజుద్దీన్ కిరాణం షాపుల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాన్ని డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తుకు బానిసవుతున్న యువతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బస్టాండ్ వద్ద ఆటో, ట్రాక్టర్, డీసీఎం వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై ఎస్సై అవగాహన కల్పించారు. అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్లో ప్రయాణించడం లాంటి కారణాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ



గుండ్రాత్‌పల్లిలో మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మధు

కాటారం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గుండ్రాత్‌పల్లిలో మాజీ సర్పంచ్ గజ్జెల రామయ్య, కొత్తపల్లిలో పెద్ది లక్ష్మీ వివిధ కార ణాలతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, మాజీ ఎంపీటీసీ బాసాని రవి, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు పూర వెంకటేశ్వర్‌రావు, మందల లక్ష్మారెడ్డి, బాసాని రవి, గాలి సడవలి, శ్రీలక్ష్మి, జాడి శ్రీశైలం, దుర్గారావు, రవి, జిల్లెల్ల శంకర్, మున్నా, దేవానాయక్, పాగె రజాకర్, శ్రీరాముల రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

మాదిగలు సాంస్కృతిక మహా ప్రదర్శనకు తరలాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

మంగపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) ఎస్సీల వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ల సురేష్ మాదిగ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పర్యటించారు. మాదిగలను మహా ప్రదర్శనకు రావాలని ఆహ్వానించారు. తిమ్మంపేటలో జరిగిన సమావేశంలో సురేష్‌మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కేంద్రాల్లో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే జిల్లా సన్నాహక సదస్సులను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో తిరుగుతూ మాదిగలు, ఉపకులాలను తరలించడం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లాలో ఈనెల 18న జరిగే సన్నాహక సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రతి మాదిగ బిడ్డ డప్పు సంకన వేసుకొని తరలిరావాలని కోరారు. ఈ సన్నాహక సదస్సులకు ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, జాతీయ, రాష్ట్ర, జిల్లా మండల ఇన్‌చార్జిలు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తప్పకుండా రావడడే కాకుండా ఒక్కొక్కరు వందలాది మందిని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు ఈసంపెల్లి సురేందర్, ఎల్పీ. కిరణ్, యెంపెల్లి మల్లేష్, పుల్లూరి తిరుపతి, పూసా ఉపేందర్, నైనారాపు కేశవులు, గోనే అప్పారావు, పూసా నవీన్ తదతరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు' సన్నాహక సభను విజయవంతం చేయండి: ఎంఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జాతీయ నాయకుడు పైడి

ములుగు కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాకేంద్రంలో ఈనెల 18న జరిగే వెయ్యిగొంతులు...లక్ష డప్పులు సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి ఇరుగు పైడి పిలుపునిచ్చారు. గురువారం ములుగు మండలంలోని కాసిందేవిపేట గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ పోరాటం చివరిఘట్టానికి చేరుకున్న క్రమంలో మాదిగ, మాదిగేతర కులాల హక్కులు, సమాన వాటా కోసం జరిగే ఆత్మగౌరవ పోరాటానికి మాదిగలు రాజకీయాలకతీతంగా కదలిరావాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు గోల్కొండ బుచ్చన్న, మడిపెల్లి శ్యాంబాబు, రేలా కుమార్, రాగుల శంకర్, ఇనుముల సుధాకర్, జన్నె భిక్షపతి, సాంబయ్య, పురుషోత్తం, జీవన్, సంజీవ, ప్రభాకర్, అనిల్, చుంచు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తలు వహించాలి

ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

ములుగు కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేయబోతుందని, అందుకు మీ-సేవ వెబ్‌సైట్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని వస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మి మోసపోవద్దని జిల్లా ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోసగాళ్లు నకిలీ మీ-సేవ పోర్టల్‌ను రూపొందించారని, ఆ పోర్టల్‌ను ఎవరూ నమ్మకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నకిలీ వెబ్‌సైట్‌కు ఎలాంటి వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దని, డబ్బులు చెల్లింపుచేసి మోసపోవద్దని సూచించారు.

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలి: బీజేపీ

మంగపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శులు పొదెం రవీందర్, లింగంపల్లి శ్రీనివాసరావు కోరారు. మంగపేటలోని బీజేపీ కార్యలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు రావుల జానకీరావు గురువారం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు రామిడి సురేష్, సత్యం, సురేష్, కున్నం వెంకట్‌రెడ్డి, నర్సింహచారి, రమేష్, రామటెంకి సమ్మయ్య, మండల కార్యదర్శులు నిడుదవోలు శ్రీనివాస్, సాంబయ్య, మండల నాయకులు రవి, తిరుపతి, రామకృష్ణ, వెంకటేష్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల చేయొద్దు

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

గోవిందరావుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు నిర్వాహ కులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని పస్రాలో గల జయ, శ్రీచక్ర నర్సింగ్ హోమ్‌లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ మిషన్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్‌లోని నిబంధనల ప్రకారం డాక్టర్ల వివరాలు, ధరల పట్టికను డిస్‌ప్లే చేయాలని, బయోలాజికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని నిర్వాహకులకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సరైన సర్టిఫికెట్లు లేని ఆయా నర్సింగ్ హోమ్‌ల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఆయన వెంట ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి, జిల్లా కీటకజనిత, టీబీ నియంత్రణ అధికారి చంద్రకాంత్, ఇన్‌చార్జి డెమో సంపత్, డీఈవో కిరణ్ ఉన్నారు.

వైద్య శిబిరం సందర్శన

మేడారం (ఆంధ్రజ్యోతి): మేడారం మినీ జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో వైద్య శిబిరం స్థలాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు గురువారం సందర్శించారు. మినీ జాతరలో భక్తులకు వైద్య సేవలు అందించడానికి ఈ శిబిరం ఏర్పాటుకు కల్యాణ మండపాన్ని పరిశీలించారు. భక్తులకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏటూరునాగారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్‌గా నియమితుడైన వసంత శ్రీనివాస్ యాదవ్‌ను చల్పాక, బానాజీబంధం, వీరాపురం కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో చల్పాక గ్రామ కమిటీ అధ్యక్షుడు పడిదల సారయ్య, గ్రామ మాజీ సర్పంచ్ చింత సుమతి, ఉప సర్పంచ్ వసంత పుల్లక్క, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చాట్ల విశ్వనాథం, మండల యూత్ ప్రధాన కార్యదర్శి వాసం రాంబాబు, ఎస్సీ సెల్, బీసీ సెల్ అధ్యక్షుడు కుదురుపాక శ్రీను, కర్నె సత్యం, మహిళ, గ్రామ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.